సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 26 । నవంబర్ । 2024



టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశాఖ ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ దర్శన్ కార్యాలయం ఆవరణంలో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. 8లో

న్యూస్‌రీల్

28న సింహగిరిపై వేదసభ

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 28న వేదసభ నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రుగ్వేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదంపై పండితులతో ఈ సభ జరగనుందన్నారు.

మైనింగ్ కార్యకలాపాలపై పోలీసుల ఆంక్షలు



స్టోన్ క్రషర్ల యాజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

తుమ్మపాల: క్వారీ వాహనాలు ప్రతి రోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పట్టణ పరిధిలో రాకపోకలు చేయడానికి వీలులేదని డీఎస్పీ ఎం.శ్రావణి ఆదేశించారు. స్టోన్ క్రషర్ల యాజమానులతో పోలీస్ గెస్ట్ హౌస్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పలు అంశాలపై మాట్లాడారు. క్వారీలకు సమీపంలోని ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం జరగకుండా బ్లాస్టింగ్ చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయాల్లో ఇలాంటి కార్యకలాపాలు జరగరాదన్నారు. క్వారీల్లో వాడే పేలుడు పదార్థాలు సంఘ వ్యతిరేక శక్తుల వద్దకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అటువంటి వ్యక్తుల వద్ద పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నప్పుడు క్వారీ యాజమాన్యం పాత్ర ఉన్నట్లు నిరూపణ అయితే వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు.

ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు

- విద్యాసంస్థలకు కలెక్టర్ హెచ్చరిక

తుమ్మపాల: విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని ఇబ్బందులు పెడితే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజును రీయింబర్స్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసిందని, త్వరలోనే చెల్లిస్తారని స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించలేదన్న నెపంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవటం, హాల్‌టికెట్లు జారీ చేయకపోవటం, పరీక్షలు రాయనీయకపోవటం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి పరీక్ష ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చిందని, విచారణలో నిజమని తేలితే సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

చండీగఢ్, పుదుచ్చేరి విజయం

విశాఖ స్పోర్ట్స్ : సయ్యద్ ముస్తాక్ అలీ (ఎస్‌ఎం) ట్రోఫీలో భాగంగా సోమవారం వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ల్లో చండీగఢ్, పుదుచ్చేరి జట్లు విజయం సాధించాయి. తొలుత చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన చండీగఢ్ తొమ్మిది వికెట్లకు 191 పరుగులు చేసింది. విదర్భ జట్టు తొమ్మిది వికెట్లకు 186 పరుగులు చేసి ఓటమి చెందింది. రెండు విజయాలతో 8 పాయింట్లతో చండీగఢ్ ఆధిక్యంలో దూసుకెళ్లింది. పుదుచ్చేరితో జరిగిన మరో మ్యాచ్‌లో చత్తీస్‌గఢ్ తొలుత బ్యాటింగ్ చేసి ఏడు వికెట్లకు 164 పరుగులు చేసింది. ప్రతిగా పుదుచ్చేరి మరో నాలుగు బంతులుండగానే నాలుగు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది.

ఎలక్ట్రికల్ రంగంలో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న డీజీఎం సతీష్‌కుమార్

మురళీనగర్ (విశాఖ): ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని ఆదానీ గంగవరం పోర్టు ఎలక్ట్రికల్ విభాగం డీజీఎం కె.సతీష్‌కుమార్ అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం 5వ సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. ప్రవీణ్‌బా ఎలక్ట్రికల్ ట్రెయినింగ్ సర్వీసెస్, ఓడిన్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించారు. శిక్షణ విభాగం ట్రైనర్ టి.రవిచంద్రన్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ విభాగంలో ఉన్న అవకాశాలు వివరించారు.

సర్వం శివమయం

- ముద్దుర్తిలో నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



పంచదార్లలో ఉమాధర్మలింగేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు (ఇన్‌సెట్) ఉమాధర్మలింగేశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకుడు



ముద్దుర్తి శ్రీ సంగమేశ్వరస్వామి స్వామివారి కల్యాణానికి తరలివచ్చిన భక్త జనం (ఇన్‌సెట్) వైభవంగా సంగమేశ్వర స్వామికి కల్యాణం

చోడవరం/రాంబిల్లి (యలమంచిలి): కార్తీక మాసం నాలుగో సోమవారం.. శివాలయాల్లో భక్తజన సందోహం.. పలు దేవాలయాల్లో కనుల పండువగా శివ పార్వతుల కల్యాణం.. ఊరూరా ఆధ్యాత్మిక వాతావరణం.. జిల్లాలోని పవిత్ర పుణ్య స్నానఘట్టాల్లో ఒకటైన ముద్దుర్తి సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతి ఏటా నాలుగో సోమవారం నాడు స్వామివారికి కల్యాణం జరుపుతారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో మూడు నదుల సంగమమైన శారదానది ఒడ్డున ఉన్న స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను ఉంచి కల్యాణాన్ని జరిపారు. స్వామివారి తిరువీధోత్సవాన్ని ముద్దుర్తి పురవీధుల్లో నిర్వహించారు. సీతానగరం, తగరంపూడి, ముద్దుర్తి, కొత్తపల్లి, భోగాపురం, గోవాడ, అంభేరుపురం, గంధవరం, వెంకన్నపాలెం నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణానికి పూలు, పండ్లు, పిండివంటలు సారె తెచ్చారు. చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఇక్కడ ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

రాంబిల్లి మండలంలోని పంచదార్ల పుణ్యక్షేత్రంలో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమాధర్మలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. కొండ దిగువన రాధామాధవస్వామి ఆలయం వద్ద ఉన్న పుణ్యధారల్లో పవిత్ర కార్తీక స్నానాలు ఆచరించి కొండ మీద ఉన్న ఉమాధర్మలింగేశ్వరుని దర్శించుకున్నారు.

విమ్స్‌లో సీబీఆర్‌ఎన్ సెంటర్‌కు అనుమతులు



ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెకండరీ లెవెల్ కెమికల్ బైలాజికల్ రేడియాలజికల్ న్యూక్లియర్ (సీబీఆర్‌ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసినట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీని సంబంధించిన ఒప్పందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపారన్నారు. ఈ కేంద్ర ఏర్పాటు కోసం విమ్స్ ఆవరణలో 1.8 ఎకరాల స్థలం కేటాయించామన్నారు. ఈ స్థలంలో మూడు అంతస్తుల భవన నిర్మాణం చేపడతారన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు మెరుగైన వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. ఇంతవరకు అలాంటి బాధితులను కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే విమ్స్‌లోనే వాటికి సంబంధించిన సేవలు అందుతామని ఆయన పేర్కొన్నారు. దేశంలో 10 సెంటర్లలో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వాటిలో ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం విమ్స్‌లో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. హెల్త్ సెంటర్ డిజాస్టర్ ప్రిపేర్నస్ అండ్ రెస్పాన్స్ కింద దీన్ని విమ్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ రాంబాబు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు



విష్వక్సేనుడికి పూజలు చేస్తున్న ఆగమ సలహాదారు వేణుగోపాల్ దీక్షితులు, వేద పండితులు

కొమ్మాది (విశాఖ): రుషికొండలో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వితీయ పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. సకల దేవతలను పవిత్రోత్సవాలకు ఆహ్వానించే క్రమంలో ముందుగా విష్వక్సేనుడికి పూజలు చేశారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం పవిత్రాల ప్రతిష్ట, 27వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు పవిత్రాల సమర్పణ, 28న సాయంత్రం 6గంటల నుండి 8 గంటల వరకు పూర్ణాహుతి నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 10–30 గంటల నుంచి 11–30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారు వేణుగోపాల్ దీక్షితులు, ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, వేద పండితులు, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత భవనం కూల్చివేత

- స్పీకర్ ఇలాకాలో కక్షసాధింపు చర్యలు



వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుణాకర్ భవనాన్ని కూల్చుతున్న మున్సిపల్ సిబ్బంది (ఇన్‌సెట్) కమిషనర్ సురేంద్రతో మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: స్పీకర్ అయ్యన్నపాత్రుడి అనుచరులు చెప్పిందే తడవుగా అధికారులు భవనాల కూల్చివేతలకు దిగుతున్నారు. తాజాగా వైఎస్సార్‌సీపీ నాయకుడు చిటికెల కరుణాకర్ (కన్నబాబు) భవనాన్ని కూల్చేశారు. వృత్తిరీత్యా డాక్యుమెంట్ రైటర్ అయిన కన్నబాబు ఎన్నికల ముందు నుంచి వైఎస్సార్‌సీపీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని స్పీకర్ అనుచరులు కన్నబాబును ఆర్థికంగా దెబ్బతీయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కన్నబాబు తరపున రిజిస్ట్రేషన్లు చేయవద్దని అధికారుల్ని ఒత్తిడి చేశారు. దీంతో ఆయన డాక్యుమెంట్లను అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం మానేశారు. ఆయన ఉపాధికి గండికొట్టిన టీడీపీ వర్గీయులు స్థానిక గచ్చపు వీధిలో ఉన్న దుకాణాలపై గురిపెట్టారు. విషయం తెలిసి కన్నబాబు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. అయినప్పటికీ ఆగస్టు 2న మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చేందుకు సిద్ధమవుతున్నారన్న సమాచారంతో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులు భవనం వద్దకు చేరుకున్నారు. దీంతో అధికారులు వెనకకు తగ్గారు. స్టే సమయం ముగియటం, మాజీ ఎమ్మెల్యే గణేష్ కాలుకు సర్జరీ చేయించుకుని హైదరాబాద్‌లో ఉండడంతో బిల్డింగ్ కూల్చేందుకు సిద్ధమయ్యారు.

గుట్టుచప్పుడు కాకుండా..

బిల్డింగ్ కూలగొడతారన్న విషయం బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తపడ్డారు. సోమవారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ రామారావు, సీఐ గోవిందరావు భవనం వద్దకు చేరుకున్నారు. అటుగా ఎవరూ వెళ్లకుండా పాత మున్సిపల్ ఆఫీసర్ రోడ్డు, గచ్చపువీధి రోడ్లను పోలీసులు దిగ్బంధం చేశారు. ముందుగా భవనానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మున్సిపల్ సిబ్బంది భవనం స్లాబ్‌ను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న భవన యజమాని అక్కడకు చేరుకుని, కోర్టు స్టే ఇచ్చిందని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కోర్టు ఆదేశాలను పరిశీలించిన తరువాతే భవనాన్ని కూల్చుతున్నామని ఆయన బదులిచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు తదితరులు అక్కడకు చేరుకున్నారు. రాజకీయ నాయకుల ఆదేశాలతో ఈ విధంగా చేయటం సరికాదని కమిషనర్‌కు వారు వివరించే ప్రయత్నం చేయగా.. పద్ధతి ప్రకారమే చేస్తున్నానంటూ కమిషనర్ రెండు చేతులు జోడించారు.

పీజీఆర్‌ఎస్‌కు సమస్యల వెల్లువ

- కలెక్టరేట్‌లో 242 అర్జీల నమోదు
- నిరసనలతో తమ కష్టాలను వెల్లడించిన బాధితులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



కులగణన జరపాలంటూ బీసీ సంఘ నాయకుల ప్రదర్శన

తుమ్మపాల: ప్రతి వారంలాగే కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)కు ఈ సోమవారం కూడా పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ కష్టాలను విన్నవించారు. వ్యక్తిగత ఇక్కట్లతో పాటు సామూహిక సమస్యలను తెలపడానికి బృందాలుగా వచ్చిన బాధితులు నిరసనల రూపంలో తమ గోడు వెళ్లబోసుకున్నారు. పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 242 అర్జీలు నమోదయ్యాయి. అధిక సంఖ్యలో రెవెన్యూ సమస్యలపై 145 వినతులు అందాయి. కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు జేసీ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందజేసిన అర్జీల గురించి సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో తక్షణమే మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

మద్యం దుకాణం వద్దే వద్దు

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ 10 వేల మంది జనాభా గల గ్రామ పంచాయతీ పాలక వర్గం తీర్మానిస్తే.. దానిని ధిక్కరిస్తూ కూటమి పార్టీల నాయకులు, ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం తగదని అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు విద్యావేత్తలు, గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణానికి ఆనుకుని శారదానది ఒడ్డున అనేక దేవాలయాలు, విద్యార్థుల నివాసాల వద్ద మద్యం దుకాణం ఏర్పాటుతో ప్రశాంత జీవనం కోల్పోతున్నామన్నారు. రాత్రి సమయాల్లో మందుబాబుల హడావుడితో మహిళలు, విద్యార్థులు భయాందోళనల గురించి కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానాన్ని గౌరవించి తక్షణమే మద్యం దుకాణాన్ని మరోచోటకు తరలించాలని కోరారు. గ్రామస్తులతోపాటు శారదా సంక్షేమ సంఘం సభ్యులు బి.దొరమ్మనాయుడు, తాడి చక్రవర్తి, ఎ.శాంతి, బి.చిన్నారావు, ఆర్.కుమారి పాల్గొన్నారు.

జనగణనతోపాటే కులగణన జరగాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న జనగణనతో పాటు కులగణన పూర్తిచేసి రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో నేటి వరకు ఏ ప్రభుత్వము సమగ్ర కులగణన చేపట్టలేదని, సమాజంలో అధిపత్యం చెలాయించే పెత్తందారి శక్తులు ఓబీసీలను అణిచివేయడంతో సమాజంలో అట్టడుగున నెట్టివేయబడ్డారన్నారు. ఓబీసీ వర్గాలు అనేక ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. దేశంలో 52 శాతం ఉన్న ఓబీసీలకు ఎస్సీ, ఎస్టీల వలే రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అధ్యాయనాలు సమగ్ర కుల గణన జరిపించాలనే నివేదికలు సమర్పించాయన్నారు.

మార్టూరు బీటలు వారుతోంది..



అపరిమిత బ్లాస్టింగ్‌లతో మా మార్టూరు గ్రామం బీటలు వారుతోంది. సర్వే నెం.1 కొండపై రసాయనాలతో బ్లాస్టింగ్‌లు చేసి ఖనిజాన్ని దోచేస్తూ ప్రజలను కాలుష్యంలోకి నెట్టేస్తున్నారు. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టి కిడ్నీ బాధితులుగా మారుతున్న ప్రజలను కాపాడాలంటూ మా గ్రామస్తులం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం. క్వారీలు, క్రషర్లలో ఉపాధి పేరుతో గ్రామస్తులను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అనధికార క్వారీల సంఖ్య విపరీతంగా పెరిగింది. భారీ బ్లాస్టింగ్‌లతో గ్రామప్రజలు హడలెత్తిపోతున్నారు. ఖనిజాన్ని రాత్రిపగలు తేడా లేకుండా పరిమితికి మించి ఓవర్‌లోడ్‌లతో తరలించడంతో గ్రామం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటోంది. ఏపీ పొల్యూషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.

–కోట్ని సురేష్, మార్టూరు

కష్టాలు కడతేర్చు కలెక్టరమ్మా..



ఇరవైసార్లకు పైగా ఫిర్యాదులు చేసినా నా మొర ఆలకించే నాధులే లేరు. నాది పూడిమడక పంచాయతీ కొండపాలెం గ్రామం. చేపలు అమ్ముకుని కష్టార్జితంతో కొనుగోలు చేసుకున్న పూడిమడక సర్వే నెం.126/2 లో (ఖాతా నెం.685) 36 సెంట్ల భూమిని అమ్ముకోకుండా పక్క రైతులు అడ్డుపడుతున్నారు. సర్వే చేయకుండా అడ్డుకుని అధికారులపై దుర్భాషలాడటంతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. చేసిన అప్పులు తీర్చుకోలేక, భూమిని అమ్ముకుంటే కొలతలు జరగకుండా నన్ను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. గత రెండేళ్ళుగా ఎమ్మార్వో, పోలీసులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం సున్నా. జిల్లా ఏర్పడిన తరువాత రెండేళ్లలో 20కి పైగా ఫిర్యాదులు చేశా. ఒంటరిదాన్ని కావడంతో నాకు ఎవరూ సహాయం చేయడం లేదు. అధికారులు కూడా న్యాయం చేయకపోవడంతో కలెక్టరమ్మయినా న్యాయం చేస్తుందన్న నమ్మకంతో వచ్చాను.

–మేరుగు కొండమ్మ, కొండపాలెం, పూడిమడక పంచాయతీ

గిరిజనేతరుల బెడద తప్పించాలి

- చీడికాడలో కోనాం ఆదివాసీల ధర్నా



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కోనాం ఆదివాసీలు

చీడికాడ: గిరిజన గ్రామమైన కోనాం గ్రామంలోని 17 ఎకరాల 78 సెంట్ల భూమిని గిరిజనేతరులకు కేటాయించారని, ఆదివాసీలకు న్యాయం చేయాలని గుంటి గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ ఆదివాసీ గౌరవ సలహాదారు పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గుంటి గ్రామానికి చెందిన ఆదివాసీలకు సర్వే నెంబరు 275, 287లలో ఈ సీలింగ్ భూమి ఉందని, ఈ భూమిని తరతరాలుగా వారే సాగు చేస్తున్నారని చెప్పారు. కాని సరైన పరిశీలన లేకుండా, ఈ భూమిని గిరిజనేతరుల పేరున పట్టాలు మంజూరు చేశారని చెప్పారు. ఈ భూములను జిరాయితీ భూములుగా మార్చడానికి ప్రయత్నం జరుగుతోందన్నారు. సాగులో వున్న ఆదివాసీలకు పట్టాలు మంజూరు చేయాలని 2015వ సంవత్సరం నుంచి వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. చట్టవిరుద్ధంగా సీలింగ్ భూములకు పట్టాలు పొందిన వారు చోడవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ 41/2003 కేసును దాఖలు చేశారని, రెవెన్యూ అధికారులు కోర్టుకు హాజరై, వాస్తవాలు వివరించాలని కోరారు.

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో 43 అర్జీలు



ఆర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 అర్జీలు వచ్చినట్లు అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు చెప్పారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలపై దిగు సిబ్బందితో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. ఆస్తి తగాదాలు, కటుంబ సమస్యలు, చీటింగ్ తదితర అంశాలపై అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కండి'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం: శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శుల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీ 99 ఏళ్ల పూర్తి చేసుకుని వందో ఏట అడుగుపెడుతోందన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కావాలన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజల అభివృద్ధికి నాయకులు కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం, పార్టీ నిధిని సకాలంలో వసూలు చేసి జిల్లాకు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, పార్టీ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

బిల్లులు కాజేసిన అధికారులపై ఫిర్యాదు



ఫిర్యాదు కాపీని చూపుతున్న మాజీ ఉప సర్పంచ్ అప్పారావు

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడకలో పలు భవనాల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను కాజేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పూడిమడక మాజీ ఉప సర్పంచ్ చోడపల్లి అప్పారావు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి సమస్య తీసుకువచ్చారు. రైతు భరోసా అలాగే హెల్త్ సెంటర్ నిర్మాణానికి కాంట్రాక్టర్‌గా తాను రూ. 18 లక్షలకు పైగా ఖర్చు చేశానన్నారు. అయితే పంచాయతీ రాజ్ డీఈ, ఏఈలు బిల్లులను కాజేశారని వారిపై చర్యలు తీసుకొని తగు న్యాయం చేయాలని అప్పారావు కోరారు.

మెగా.. దగా



శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన ఇందిర భర్తతో పాటు విశాఖలో ఉంటోంది. ప్రైవేటు స్కూల్లో చేస్తున్న ఉద్యోగం మానేసి, విశాఖ వచ్చి ఆరు నెలలుగా డీఎస్సీకి సిద్ధమవుతోంది. ఇద్దరు పిల్లల్లో ఒకర్ని భర్త చూసుకుంటుండగా, చిన్నోడిని తల్లి వద్ద ఉంచేసి, ఎలాగైనా కొలువు సాధించాలని పట్టుదలతో చదువుతోంది. కానీ డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యమవుతుండటంతో ఒత్తిడికి గురికావల్సి వస్తోందని ఇందిర తెలిపింది. ఒక్క ఇందిరే కాదు విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న ఏ ఒక్కరిని కదిపినా ఇదే మాట వినిపిస్తోంది.

విశాఖ విద్య : మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే అని గొప్పలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ మాత్రం ప్రకటించలేదు. ఈ నెల 6న నోటిఫికేషన్ జారీచేస్తారని అంతా అనుకున్నా మళ్లీ వాయిదా పడింది. ఇంతకీ ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందో..? లేదోనన్న సందేహాలు కలుగుతున్నాయి. టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డీఎస్సీ కోసం రేయింబవళ్లు సిద్ధమవుతున్నారు. కొంతమంది ప్రైవేటు స్కూళ్లలో చేస్తున్న కొలువు మానేసి.. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నారు. కూటమి ప్రభుత్వం అదిగో, ఇదిగో డీఎస్సీ అంటూ కాలయాపన చేస్తుండటంపై



విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీల గుర్తింపుపై కానరాని స్పష్టత

మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు 1,134 పోస్టులు భర్తీ చేయనున్నారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నారనే క్షేత్ర స్థాయి నివేదికలతో ప్రభుత్వం డైలమాలో పడింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో 734 ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు లెక్క తేల్చారు. వీటిలో ఎస్జీటీ పోస్టులు 216 వరకు ఉన్నాయి. దీనిపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవటం, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై రోజుకో ప్రకటన చేస్తుండటంపై నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

రోస్టర్ పాయింట్లతో రాద్ధాంతం

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసమని ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టుల రోస్టర్ పాయింట్ల లెక్క తేల్చాలని ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో రోస్టర్ పాయింట్ల వ్యవహారంతో ఇటీవల జరిగిన ప్రమోషన్ల ప్రక్రియలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై కాలయాపన చేస్తున్న నేపథ్యంలోనే తేనెతుట్టెను కదుపుతోందని ఉపాధ్యాయులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో విలీనమైన సమయంలోనే మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో క్యాడర్ స్ట్రెంత్ వివరాలను స్థిరీకరించాల్సి ఉండగా, అప్పట్లో జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవటంతో ఇప్పుడు సమస్యలొచ్చిపడ్డాయి.

టీచర్లకు ప్రమోషన్ల కోత

మెగా డీఎస్సీ మాటేమోకానీ.. ఆ బూచితో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లకు కూటమి ప్రభుత్వం కోతపెడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెలవారీ ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి ఊసే లేదు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న మున్సిపల్ మేనేజ్‌మెంట్ స్కూళ్లలో అన్ని క్యాడర్లు కలిపి ఇటీవల 11 మందికి ప్రమోషన్లు ఇచ్చారు. డీఎస్సీ కోసం 109 ఖాళీలు చూపించగా.. వీటిలో 30 శాతం కోటా మేరకు ప్రమోషన్లు కల్పించాలి. ఈ విషయంలో జరిగిన తప్పిదాలతో మరోమారు ఖాళీల గుర్తింపుపై రాష్ట్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రోజుకో నిర్ణయం తీసుకుంటుండటంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

ఆశతో ఎదురుచూస్తున్నాం..

డీఎస్సీ ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. పద్మనాభం నుంచి విశాఖ వచ్చి రూమ్ తీసుకొని రాత్రిపగలనకుండా ఎంతో కష్టపడి చదువుతున్నాం. కోచింగ్ కోసం చాలా డబ్బులు ఖర్చు చేశాం. ప్రతీ ఏడాది డీఎస్సీ ప్రకటించి, పోస్టులను భర్తీ చేయాలి. మెగా డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలి. – ప్రియాభవానీ, ఎమ్మెస్సీ, ఎంఈడీ, పద్మనాభం

పీహెచ్‌సీలో శతశాతం ప్రసవాలు జరగాలి

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వీరజ్యోతి



సిబ్బందికి వైద్య సేవలపై సూచనలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వీరజ్యోతి

రోలుగుంట : పీహెచ్‌సీలో శతశాతం ప్రసవాలు జరిపించి, నిర్ణయించిన లక్ష్యాలను అధిగమించాలని పీహెచ్‌సీ సిబ్బందిని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా ప్రాజెక్టు అధికారి కె.వీరజ్యోతి ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించారు. ఓపీ గురించి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారి శ్రావణి, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గర్భిణులకు స్కానింగ్ చేసి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడంతో పాటు బిడ్డ ఎదుగుదల, ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరోగ్య రికార్డు (కేస్ సీటు)లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో గర్భిణులందరి వివరాలు నమోదు చేసుకొని, శతశాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈవో ఎస్.కృష్ణ, సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్ సాజహాన్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలిగా వత్సవాయి శ్రీలక్ష్మి



జిల్లా యూటీఎఫ్ నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నరావు

అనకాపల్లి : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా అధ్యక్షురాలుగా వత్సవాయి శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొంది చిన్నబ్బాయ్, గౌరవాధ్యక్షులుగా పంపన బోయిన వెంకట్రావు, సహాధ్యక్షులుగా రొంగలి అక్కునాయుడు మహిళా సహాధ్యక్షులుగా పి.గాయత్రి, కోశాధికారిగా జోగా రాజేష్, జిల్లా కార్యదర్శులుగా దొగ్గ శ్రీనివాస్, కలింగ సతీష్, పొలిమేర చంద్రరావు, గుత్తుల సూర్యప్రకాష్, మాకిరెడ్డి రాజునాయుడు, వి.రమేష్‌రావు, నడికట్ల శేషుకుమార్, జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్ హైమావతి, ఆడిట్ కమిటీ సభ్యులుగా వేచలపు నాగేశ్వరరావు, షేక్ సలీం, శాంతకుమారి, అనిమిరెడ్డి సాంబమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఈ.ఎల్లయ్యబాబు, ఎం.వెంకటప్పారావు, గేదెల శాంతిదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నరావు వ్యవహరించారు. జిల్లా నూతన కమిటీ ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, విద్యారంగ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. పీఆర్సీ విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లడం జరుగుతుందన్నారు.

రూ.4.65 లక్షల చోరీ సొత్తు రికవరీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

పాయకరావుపేట : వివిధ చోరీ కేసుల్లో దొంగలించిన సొత్తును రికవరీ చేసినట్టు డీఎస్పీ జి.ఆర్.ఆర్ మోహన్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 15 వ తేదీ రాత్రి రెండు గంటల సమయంలో నోకియా సెల్‌ఫోన్ కంపెనీ ఉద్యోగి బీహార్‌కి చెందిన మహమ్మద్ దిల్సాద్ తుని రైల్వే స్టేషన్‌లో పూరి తిరుపతి రైలు దిగి నడుచుకుని సుగర్ ఫ్యాక్టరీ దరి ఎయిర్‌టెల్ కార్యాలయానికి వెళ్తుండగా ఫ్యాక్టరీ మలుపు వద్ద ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్ పై వెనుక నుంచి వచ్చి అతనిని అటకాయించారు. మెడపై కత్తి పెట్టి భయభ్రాంత్రులకు గురిచేసి, చేతిపై కత్తితో గాయపరిచి అతని వద్ద నున్న ల్యాప్‌ట్యాప్ బ్యాగు, వాచ్, సెల్‌ఫోన్‌ను దౌర్జన్యంగా లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీసీ ఫుటేజీల ఆధారంగా సీఐ, ఎస్ఐ టీం నిందితులను గుర్తించి పట్టుకున్నారు.

వారి వద్ద నుంచి 3 బైక్‌లను, ల్యాప్‌టాప్, వాచ్, పెన్‌డ్రైవ్, పర్సు, ఏటీఎం కార్డు రికవరీ చేశారు. సోమవారం సుమారు 10 గంటల సమయంలో తాండవ షుగర్ ఫ్యాక్టరీ వద్ద 3 మోటార్ బైక్‌లు, ఐదుగురు నిందితులను పట్టుకోవడం జరిగింది. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన సీఐ జి.అప్పన్న, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విపత్తుల నుంచి బయటపడండిలా..





గ్యాస్ వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరిస్తున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం

- వివరించిన ఎన్డీఆర్ఎఫ్ బృందం

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్‌లో సోమవారం ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై స్కూల్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను అప్రమత్తం చేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు జాతీయ విపత్తు స్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 10 వ బెటాలియన్ టీం కమాండర్ వై.సత్యనారాయణ తెలిపారు. 10వ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ వి.వి.ఎన్ ప్రసన్న కుమార్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబరు 11 వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు షెడ్యూలు ప్రకారం కోస్తా తీర మండలాల్లో గల గ్రామాలు, పాఠశాలలు, పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీ ప్రకాష్‌లో విద్యార్థులకు ప్రమాదంలో గల వారిని కాపాడడం, సీపీఆర్, తదితర అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాయకరావుపేట తహసీల్దార్ జి.సత్యనారాయణ, రెవెన్యూ సర్వేయర్ డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ టి.త్రినాథ్, వీఆర్ఓలు రాజేష్, సునీత, 2 వ మండల విద్యాశాఖాధికారి రమేష్, పోలీస్, ఫైర్, ప్రైమరీ హెల్త్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలన, రాజనీతి శాస్త్ర విభాగం ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పొలిటికల్ సైన్స్ విభాగం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూజీసీ సూచించిన విధంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించామని, వీరికి బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్స్ ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్ రాజు, ఆర్.పద్మశ్రీ, డి.నగ రాజకుమారి, డీన్ పి.అరుణ్ కుమార్, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీకై ముగ్గురికి గాయాలు





గాస్ లీకై గాయాలైన చిన్నమ్మలు, కుమారుడు మహాలక్ష్మినాయుడు

బుచ్చెయ్యపేట : కేపీ అగ్రహారం గ్రామంలో ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఒకే కుటుంబంలో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన సుంకర చిన్నమ్మలు సోమవారం తన ఇంట్లో వంట చేస్తుండగా రెగ్యులేటర్ వద్ద గ్యాస్ పైపు ఊడిపోయి మంటలు వ్యాపించాయి. దీంతో చిన్నమ్మలుతో పాటు అతని భర్త అప్పలనాయుడు, కుమారుడు మహాలక్ష్మినాయుడు మంటలు ఆర్పే ప్రయత్నం చేయడంతో వారి కాళ్లు, చేతులు, ఒంటిపైన గాయాలై బొబ్బలెక్కాయి. వారిని బుచ్చెయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవల కోసం అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సిలిండర్లో తక్కువ గ్యాస్ ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని లేకపోతే గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

ఘనంగా నూకాంబిక సారె ఊరేగింపు



అమ్మవారి సారె ఊరేగింపు (ఇన్‌సెట్) పి.ధర్మవరంలో నూకాంబిక అమ్మవారు

ఎస్.రాయవరం : పి.ధర్మవరం ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామునుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. పిండి వంటలు, సంప్రదాయబద్ధంగా పసుపు కుంకుమలు ఆలయం వరకు భారీ ర్యాలీతో ఊరేగించి ఆలయానికి తరలివెళ్లి సారె సమర్పించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నృత్య వైభవం



కళాకారుల నృత్య ప్రదర్శన



గిరిజన సంప్రదాయ నృత్యం ప్రదర్శన

ఏయూక్యాంపస్: భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని విశాఖలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు సోమవారం కొనసాగాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా మైదానంలో జరిగిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నగరవాసులను అలరించాయి. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు వారి సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పాయి. ఆదివాసీ మహిళలు, విద్యార్థులు గిరిజన సంప్రదాయాలను గుర్తుచేస్తూ చేసిన నృత్యాలు అందరి మనసులను గెలుచుకున్నాయి. ఎంతో ప్రాచుర్యం పొందిన థింసా నృత్యం, కొమ్ము నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వాయిద్యాలకు అనుగుణంగా ఆదివాసీ మహిళలు ఏకరూప దుస్తులు ధరించి చేసిన నృత్యాలు ఆదివాసీ జీవన వైవిధ్యతను చాటి చెప్పాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ ఉత్పత్తుల విక్రయాలకు మంచి ఆదరణ లభించింది.

ఏయూలో విజిలెన్స్ వ్యవస్థ పటిష్టం

- వీసీ ఆచార్య శశిభూషణరావు



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పారదర్శకతను పెంపొందించే విధంగా విజిలెన్స్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఏయూ ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై వర్సిటీలో టెండర్లు, కొటేషన్లు, సీపీసీలో ఉంచే ప్రతిపాదనల వంటివన్నీ విజిలెన్స్ అధికారి పరిశీలన, అనుమతితో మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో జరిగే ఆర్థిక లావాదేవీలు, విత్త నిర్వహణ విజిలెన్స్ అధికారి పరిశీలించి, వారి అనుమతి పొందిన తర్వాతే నిర్వహిస్తామన్నారు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా కొనుగోలు చేసే పరికరాలకు విజిలెన్స్ అధికారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సివిల్, ఎలక్ట్రికల్ వర్క్‌లో నిర్వహణ, వస్తువుల కొనుగోలు తదితర అంశాలలో విజిలెన్స్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యుడు టి.చిట్టిబాబును విజిలెన్స్ అధికారిగా ఇప్పటికే నియమించామని, ఆయన అన్ని అంశాలను పరిశీలించి అనుమతులిస్తారని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ విభాగాల్లో నిర్వహించే సదస్సులు, సమావేశాల ఫోటోలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పొందుపరచాలని వీసీ తెలిపారు. దీనికోసం ఏయూ కంప్యూటర్ సెంటర్ నిర్వహణలో సిబ్బంది పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్,అధికారులు, హాస్టల్ చీఫ్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

30లోగా హౌస్ హోల్డ్ జాబితా సర్వే పూర్తి

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉండే ఇళ్లు/ఫ్లాట్లు/అపార్టుమెంటు/ గేటెడ్ కమ్యూనిటీ హౌస్ హోల్డ్ జాబితా రూపొందించేందుకు సచివాలయ ఉద్యోగులతో సర్వే చేస్తున్నామని, ఈ సర్వేకు ప్రజలందరు సహకారం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. ఈ సర్వేలో ఎటువంటి సందేహాలు, అపోహలకు తావు లేకుండా జియో టాగింగ్ యాప్‌లో ప్రతి ఇంటి నుంచి అన్ని వివరాలతో బయోమెట్రిక్‌తో వివరాలు నమోదు చేయనున్నామన్నారు. ఈనెల 30వ తేదీలోపు సర్వే పూర్తి చేయవలసి ఉందన్నారు.



దేదీప్యమానం..కార్తీక దీపోత్సవం

ఎంవీపీకాలనీ(విశాఖ): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ దర్శన్ కార్యాలయం ఆవరణంలో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నగర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కార్తీక దీపాలు వెలిగించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పూజలకు అవసరమైన సామగ్రిని హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సమకూర్చింది. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ విశాఖ జిల్లా సూపరింటెండెంట్ కాంతికుమార్‌తో పాటు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కల పెంపకానికి శ్రీకారం



కశింకోటలో మొక్కల పెంపకానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

కశింకోట: కశింకోటలోని జాతీయ రహదారి పక్కనున్న కోనేరును అభివృద్ధి చేయడంలో భాగంగా పల్లె వనం కార్యక్రమం కింద చుట్టూ గట్లపై మొక్కలు నాటే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద గట్లపై పేరుకుపోయిన తుప్పలను తొలగించి టేకు మొక్కల పెంపకానికి భూమి పూజ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఏపీవో ఎం.శ్రీనివాసరావు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెండి నాగాభరణం బహూకరణ



బసవేశ్వరస్వామి ఆలయానికి వెండి నాగాభరణం అందజేస్తున్న బండారు రామ, రమాదేవి దంపతులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో వెలసిన భువనేశ్వరి సహిత బసవేశ్వరస్వామి ఆలయానికి రూ.2 లక్షలు విలువ చేసే వెండి నాగాభరణాన్ని సోమవారం బండారు రామ, రమాదేవి దంపతులు బహూకరించారు. వారు కుటుంబ సమేతంగా వచ్చి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మకు నాగాభరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 5,892 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,630	4,400
మొదటి రకం	3,200	4,000
రెండో రకం	3,000	3,410
మూడోరకం	2,840	3,020

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 8 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 366 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

‘మధ్యాహ్న’ భోజనంపై ధరాభారం.!

- పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మారని మెనూ చార్జీలు
- మూడు నెలలుగా పథకం నిర్వాహకులకు అందని బకాయిలు

అనకాపల్లి: ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసరాల ధరల పెరుగుదల మంట పుట్టిస్తోంది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకానికి బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా విడుదల చేయడం లేదు. పథకం పేరు మార్పు చేయడం తప్ప మెనూ చార్జీలు పెంచలేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోందనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరకులు, కూరగాయలు, వంటనూనె ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరల నియంత్రణలో నాలుగు మాసాలుగా ప్రభుత్వం విఫలమైంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో....

బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం మెనూ చార్జీలు మార్పులు చేస్తుండేది. దీంతో పథకం నిర్వాహకులకు ఇబ్బంది ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో పథకం నిర్వాహకులపై ఆర్థిక భారం పడుతోంది.

మూడు మాసాలుగా బిల్లుల పెండింగ్

- గత ప్రభుత్వంలో ప్రతి నెలా 15 నుంచి 20వ తేదీలోపు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లులు చెల్లించేవారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ఏడాది జూలై మాసం వరకూ మెనూ చార్జీలు చెల్లించారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వాహకులు అప్పులు చేసి పిల్లలకు భోజనాలు పెడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.
- ప్రభుత్వం జీవో ప్రకారం 25 మంది విద్యార్థులకు ఒక నిర్వాహకురాలు, 26 నుంచి 100 మంది వరకూ ఇద్దరు నిర్వాహకులు మాత్రమే ఉండాలని పేర్కొంది.
- మధ్యాహ్న భోజన పథకం నిబంధనలు ప్రకారం 50 మంది విద్యార్థులకు ఇద్దరు నిర్వాహకులు ఉండాలి.
- హైస్కూల్ స్థాయిలో 600 నుంచి 650 మంది విద్యార్థులకు ముగ్గురు, నలుగురు మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది పని చేస్తుంటే ఇద్దరికి మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు.
- నెలకు చాలీచాలనీ రూ.3వేలు జీతం చెల్లిస్తున్నారు.
- అక్టోబర్‌లో హైస్కూల్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న పథకం నిర్వాహకులను తొలగించారు. స్కూల్‌కు ఒక్కరూ మాత్రమే పనిచేయాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



హైస్కూల్‌లో వంట చేస్తున్న భోజన పథకం నిర్వాహకురాలు



జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ధరలు అదుపు చేయాలి..



నిత్యావసర, కూరగాయలు ధరలు అదుపు చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే ధరలతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలంటే కష్టంగా ఉంటుంది. మూడు మాసాలుగా పథకం నిర్వాహకులకు ప్రభుత్వం ఎటువంటి నగదు చెల్లించలేదు. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలి.

– సూరి లక్ష్మి, పథకం నిర్వాహకురాలు, అనకాపల్లి మండలం

తొలగించిన కార్మికులను తిరిగి తీసుకోవాలి



ప్రభుత్వాలు మారినప్పటికీ మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకుల జీవితాలు మారడం లేదు. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి. నిర్వాహకులకు కనీస వేతనం రూ.10 వేలు అమలు చేయాలి. పథకం నుంచి గత నెల తొలగించిన సిబ్బందిని ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలి.

– వి.వరలక్ష్మి, సీఐటీయూ నాయకురాలు

లింగ వివక్ష తగదు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శచిదేవి

తుమ్మపాల: లింగ వివక్ష తగదని, దీనిపై వచ్చేనెల 23వ తేదీ వరకు నిర్వహించే జాతీయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కె.శచిదేవి కోరారు. పట్టణంలో డీఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాలుగు వారాల పాటు అన్ని మండలాల్లో సభలు, ర్యాలీలు, సమావేశాలు జరిపి మహిళలను చైతన్యం చేయాలన్నారు. మొదటి వారం రోజుల పాటు జెండర్ పట్ల అవగాహన, అందుబాటులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013 ప్రకారం ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియజేయాలన్నారు. రెండో వారం ఆడ పిల్లలకు విద్య, మూడో వారంలో బాల్య వివాహాల నివారణ, నాలుగో వారం గృహ హింసపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ విరమించుకోవాలి



ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

అనకాపల్లి: మండలంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతుల నుంచి భూములను బలవంతంగా సేకరించడం కూటమి ప్రభుత్వం మానుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో వేటజంగాలపాలెం, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో భూసేకరణపై సోమవారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 10 మండలాల పరిధిలో 54 గ్రామాల్లో 6116.50 ఎకరాలను భూసేకరణ చేయడానికి గ్రామసభలు నిర్వహించారన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కూలీలు వృత్తిదారులు భూములు ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తేలయ్యబాబు, గోవిందు. జి.సుభాషిణి, సిగిరెడ్డి వెంకటేశ్వరరావు, బండి దుర్గారావు, గోన రాజు, పిల్లా సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

‘ఆశీల పాట నిర్వహించకుండా కుమ్మక్కు’



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు భద్రం

తుమ్మపాల: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో వాహనాల వేలం పాటలు నిర్వహించకుండా అధికారులు, కాంట్రాక్టర్లు కొమ్మక్కై ఆశీలు వసూలు చేస్తూ లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్ భద్రం, రైతు సంఘ నాయకులు కోరుబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, తాకాసి వెంకటేశ్వరరావు ఆరోపించారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2023 -2024 ఏడాదికి ఆశీల పాటు నిర్వహించగా మార్చి 2024తో గడువు ముగిసిందన్నారు. తరువాత అధికారులు వేలం నిర్వహించగా కాంట్రాక్టర్లు సిండికేట్ కావడంతో పాటను రద్దు చేశారన్నారు. అప్పటి నుంచి అనుమతులు పొందకుండా పాత కాంట్రాక్టరే అధికారులతో కుమ్మక్కై ఏప్రిల్ 2024 నుంచి ఆశీలు వసూలు చేస్తున్నాడన్నారు. దీనిపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపిస్తే నిజానిజాలు బయటపడతాయన్నారు.

8న జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

అనకాపల్లి: జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు వచ్చేనెల 8వ తేదీన స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి ఏడీ స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు టేబుల్ టెన్నిస్ జిల్లా చైర్మన్ డాక్టర్ విష్ణుమూర్తి, అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చేనెల 21, 22, 23 తేదీలలో కాకినాడ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94411 49808 నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అనకాపల్లి: సైకిల్‌పై వెళ్తున్న రమాపురం గ్రామానికి చెందిన రామఅప్పారావును మండలంలో జాతీయ రహదారి పిసినికాడ గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు పాలైన ఆయనను స్థానికులు హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు రామఅప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న నాణేలు, స్టాంపుల ప్రదర్శన



నాణేలు, స్టాంపుల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: విద్యార్థులకు చదువుతో పాటు, విజ్ఞానంపై అవగాహన కల్పించాలని లింగరాజుపాలెం సర్పంచ్ అల్లూరి ఉదయకుమారి కోరారు. గ్రామంలో ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన పలు దేశాలు స్టాంప్‌లు, నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ శ్రీధర్ సహకారంతో నాణేలను ప్రదర్శించారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం-జి.భీమవరం మధ్య ఉన్న రోడ్డు మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా స్థానికుల వినతి మేరకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఈ పనులను రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కూండ్రపు రామునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఆర్ అండ్ బీ జేఈ సత్యవాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా ఆఖరి సోమవారం పూజలు



కశింకోటలోని శివాలయంలో శివ లింగానికి పండ్ల రసాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు



బట్లపూడి సోహం ఆశ్రమంలో భక్తులకు వడ్డిస్తున్న మధుబాబు



మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధనలో మలసాల కుమార్‌రాజా



వేలుపలవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో క్యూలో భక్తులు

కశింకోట: ఆఖరి కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శివ నామ స్మరణతో మార్మోగాయి. కశింకోటలోని పురాతన శివాలయం సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలు, చెరకు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. శాలిగ్రామ పూజలను భక్తులతో జరిపించారు. అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో ఉదయం నుంచి బారులు తీరి దర్శించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక కస్పావీధిలోని సాంబశివుని ఆలయంలో అర్చకుడు వేయిదళముల ప్రసాద్ ఆధ్వర్యంలో, గవరపేటలోని ఉమా శంకరుల ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం, వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, సోమవరం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం, చింతలపాలెం శివాలయాల్లోను, ఏఎస్ పేటలోని సాంబశివుని ఆలయం, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి, సాంబమూర్తి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

- కశింకోట శివాలయంలో సోమవారం రాత్రి గోవిందరావు కాలనీకి చెందిన మహిళా బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. కార్తీక సోమవారం పురస్కరించుకుని దేవునిపై కూర్చిన పాటలకు నృత్యం చేస్తూ ఆహూతులను ఆకట్టుకున్నారు.

తుమ్మపాల: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలో బట్లపూడి సోహం ఆశ్రమంలో నిత్య పూజలు కొనసాగుతున్నాయి. నాలుగో సోమవారం ఆశ్రమంలో తెల్లవారు నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన కొణతాల వెంకటరమణ భార్య మహాలక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారుడు మధుబాబు భక్తులకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తాడి రామకృష్ణ, పలమరిశెట్టి సత్యనారాయణ, కాండ్రేగుల రామకోటి, బిశెట్టి నాగేంద్ర, కాండ్రేగుల రామకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

- గవరపాలెం అగ్గిమర్రిచెట్టు మీనాక్షి సుందరేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం 4వ సోమవారం సందర్భంగా 216వ లీలా కల్యాణ మహోత్సవం 215 మంది దంపతులతో కొణతాల కారుబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోదరుడు మలసాల కుమార్ రాజా కల్యాణ మహోత్సవానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గలక్ష్మి ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, వాసుపల్లి తాతారావు, సూరిశెట్టి సత్తిబాబు, మారిశెట్టి శ్రీను, మూనూరు శ్రీను, గొల్లవిల్లి నర్సింగరావు, శ్రీధరాల మనోజ్, పిల్లా రాజు, కోన దుర్గా ప్రసాద్, రాపేటి మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి: పట్టణ, మండలంలో కార్తీక మాసం నాలుగో సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి, మెయిన్ రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, కూరగాయలు మార్కెట్ వద్ద సాధువుల గుడి, గవరపాలెం భోగలింగేశ్వరస్వామి, చిన్నరాజుపేట సాంబశివుని గుడి, గాంధీనగరం, శారదానది ఒడ్డున ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



కూరగాయలు మార్కెట్ వద్ద సాధువుల గుడిలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



మెయిన్‌రోడ్డు సిద్ధి లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

పట్టణంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు సన్నాహాలు

తుమ్మపాల: పట్టణంలో విజయరామరాజుపేట, గుండాలు, లక్ష్మీదేవిపేట, తదితర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటులో భాగంగా జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్ సోమవారం పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకలు రద్దీ పెరగడంతో స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక వినతి మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలపడంపై ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, పల్లా సత్య అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. వినాయక మందిరం జంక్షన్ నుంచి విజయరామరాజుపేట టెంట్ హౌస్ జంక్షన్, గుండాల జంక్షన్ నుంచి మిరియాల కాలనీ, పట్నాల పేర్రాజు షాప్ సెంటర్లలో స్పీడ్ బ్రేకర్లు వేసేందుకు అధికారులకు సూచించామని వారు తెలిపారు.

త్వరలో కొత్త భవనంలోకి హైస్కూల్ తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

అనకాపల్లి: ఎన్టీఆర్ కాలనీలోని హైస్కూల్‌ను త్వరలో కొత్త భవనంలోని తరలించనున్నట్టు డీఈవో అప్పారావు నాయుడు తెలిపారు. ఈ నెల 20న సాక్షి దినపత్రికలో ‘రేకుల షెడ్లలోనే చదువులు’శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు సోమవారం మాట్లాడుతూ గతంలో నాడు-నేడు కింద భవనం నిర్మించామని, టాయిలెట్స్‌కు నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు టాయిలెట్స్ నిర్మించామని, కొత్తపైపులు బిగించి, రన్నింగ్ వాటర్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉందన్నారు. గ్రౌండ్ లెవెల్ చేయాల్సిన పని ఉందని, త్వరలో పనులు పూర్తిచేసి కొత్త భవనంలోకి హైస్కూల్‌ను తరలిస్తామన్నారు.

రబీ పంటలకు బీమా చేయించుకోవాలి

కశింకోట: రబీ పంటలకు రైతుల స్వచ్ఛందంగా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న కోరారు. మినప పంటకు ఎకరానికి రూ.300 బీమా రుసుంగా వచ్చే నెల 12వ తేదీలోగా మీసేవ కేంద్రాల్లో చెల్లించాలన్నారు.